



సంతాన సాఫల్య కేంద్రాలపై.. నిఘా

● జిల్లాలో ప్రత్యేక బృందాలతో తనిఖీలకు రంగం సిద్ధం ● అనుమతులపైనా అధికారుల ఆరా ● నకిలీ డాక్టర్లపైనా కొరడా

నిర్మల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేకుండా కొనసాగుతున్న కొన్ని సంతాప సాఫల్య కేంద్రాలతో పాటు నాటు వైద్యం పేరిట కొనసాగుతున్న ఈ దందాపై నిఘా మొదలైంది. హైదరాబాద్‌లో జరిగిన ఓ ఐవీఎఫ్ సెంటర్ అక్రమాల కారణంగా ప్రభుత్వం అన్ని జిల్లాల్లో సంతాన సాఫల్య కేంద్రాలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్ర బృందాలతో పాటు జిల్లాస్థాయిలో కూడా ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టనున్నాయి. ఇందులో భాగంగానే విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టేందు కోసం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. అన్ని జిల్లాలకు ఒక టాస్క్‌ఫోర్స్ టీంను ఏర్పాటు చేసి ఈ టీమ్ ద్వారా విస్తృత తనిఖీలను చేపట్టనున్నారు. ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలలో స్పెషలిస్టు వైద్యులతో పాటు అడ్వకేట్‌లు, పోలీసు అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సభ్యులు గా ఉండనున్నారు. జిల్లాలో కూడా రాష్ట్ర తనిఖీ బృందానికి సహకరించేందుకు జిల్లా స్థాయి బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా కొద్ది రోజుల క్రితం నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్‌లలో మెడికల్ కౌన్సిల్‌కు సంబంధించిన అధికారులు తనిఖీలు జరిపి పలు అనుమతులు లేని ఆసుపత్రుల గుట్టు రట్టు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పాటుఅలాగే నకిలీ డాక్టర్లను కూడా అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

అయినప్పటికి ఇంకా నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్, ముథోల్‌లలో విచ్చలవిడిగా నకిలీ డాక్టర్లు వైద్యం అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ఎలాంటి విద్యార్హత లేకున్నా కొంతమంది డాక్టర్లుగా చెలామణి అవుతూ నర్సింగ్ హోంలను తలపించే స్థాయిలో ప్రైవేటు క్లినిక్‌లను నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదులున్నాయి. అలాగే ఇటీవలే కొంతకాలం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది సంతాన సాఫల్య పేరిట కొత్త దందాను కూడా ప్రారంభిస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి దవాఖానాలలో అమాయకులు వైద్యం కోసం వేల రూపాయలను దారపోస్తున్నారు.

నకిలీ ఐవీఎఫ్ కేంద్రాలపై దృష్టి

జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లలో గత కొంతకాలం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న అక్రమ సంతాన సాఫల్య కేంద్రాలపై ప్రత్యేక బృందాలు పకడ్బందీగా దృష్టి సారించబోతున్నాయి. జిల్లాలో కొంతమంది ఎలాంటి కొంతమంది ఎలాంటి అనుమతులు గాని, సాఫల్య కేంద్రాల ఏర్పాటుకు అనుసరించాల్సిన నిబంధనలు పాటించకుండా వీటిని ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలను ఏజెంట్లుగా నియమించుకుంటూ కొన్ని సంతాన సాఫల్య కేంద్రాలు సంతానం లేని అమాయక జనాన్ని బుట్టలో వేసుకుంటున్నట్లు చెబుతున్నారు. కొంత మంది ఆర్‌ఎంపీలకు ఆకర్షణీయమైన కమీషన్‌లు ఇస్తూ అమాయకులను లక్ష్యంగా చేసుకొని సంతానం కలిగిస్తామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. సంతానం కోసం వెళ్లే మహిళలకు ఈ కేంద్రాల డాక్టర్లు ఎక్కువ డోసులతో కూడిన హర్మోన్ టాబ్లెట్‌లను అలాగే అవసరం లేని మందులను అంటగడుతున్నట్లు కూడా ఫిర్యాదులున్నాయి. ముఖ్యంగా స్కానింగ్‌లు, రక్త పరీక్షల పేరిట సంతానం కోసం వెళ్లే మహిళల నుంచి పెద్దమొత్తంలో ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. అయితే వైద్యారోగ్య శాఖ ఈ నకిలీ వైద్యులపైనే కాకుండా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సంతాప సాఫల్య కేంద్రాలపై కూడా తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతుండడంతో నకిలీల గుండెల్లో దడ మొదలైంది.

జిల్లాలో తనిఖీ బృందాలకు రంగంసిద్ధం

జిల్లాలో నకిలీ డాక్టర్ల ఆగడాలు, బోగస్ ఆసుపత్రులతో పాటు అనుమతులు లేకుండా సంతాన సాఫల్య కేంద్రాల నిర్వహణపై తనిఖీలు చేపట్టేందుకు స్పెషల్ టాస్క్‌పోర్సు టీంలను ఏర్పాటు చేయబోతున్నారు. ఈ టీంలలో స్పెషలిస్టు డాక్టర్‌లతో పాటు ఐఎంఎ ప్రతినిధులు, తెలంగాణ హస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ప్రతినిధులు, డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు, అడ్వకేట్‌లు, పోలీసు అధికారులను సభ్యులుగా నియమించనున్నారు. సభ్యుల ఎంపిక కోసం వారి వారి అసోసియేషన్‌ల సమాచారం అందించి వారి సహకారంతో ఈ ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలో 30 మంది డాక్టర్లతో కూడా ఓ టాస్క్‌ఫోర్సు టీంను ఏర్పాటు చేశారు.

బోగస్ ఆస్పత్రులపై ఇక చర్యలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రోజురోజుకు నకిలీ డాక్టర్ల వైద్యం దందా విస్తరిస్తోంది. కనీస సౌకర్యాలు లేకుండానే చిన్నచిన్న గదులలో ఈ నకిలీ డాక్టర్లు నర్సింగ్ హోంలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నర్సింగ్ హోంలలోనే లాబోరేటరీ, మెడికల్ షాపులు, ఎక్స్‌రే యూనిట్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. రోగులకు అవసరం లేకున్నా అన్ని రకాల పరీక్షలు చేయిస్తూ వారి నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నే రక్త పరీక్షల రిపోర్టులను అలాగే ఎక్స్‌రే రిపోర్టులను, ఈసీజీ రిపోర్టుల ను అందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చాలా గ్రామాల్లో కూడా ఇలాంటి నర్సింగ్ హోంలు విచ్చలవిడిగా వెలుస్తుండడం పర్యవేక్షణ లేకపోవడం అక్రమ వైద్యులకు వరంగా మారింది. ఈ ఆసుపత్రులలో వైద్యం వికటించి రోగులు ప్రాణాలు పోతున్న పట్టించుకునేవారే కరువయ్యారంటున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో స్పెషల్ టాస్క్‌పోర్సు టీంలు ఏర్పాటు అవుతుండడంతో పరిస్థితి కొంతవరకైనా మారే అవకాశం ఉంటుందంటున్నారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయాధికారి రాధిక

విద్యార్థులు మంచి మార్గంలో నడవాలి

● దేగాంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన

భైంసా రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి) మండలంలోని దేగాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై సోమవారం జిల్లా న్యాయాధికారి రాధిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులు, విద్యార్థి దశలోనే పిల్లలు మంచి మార్గంలో నడవాలన్నారు. మన చుట్టూ జరుగుతున్న అనైతిక కార్యక్రమాలు అలవాటు పడకుండా మంచి మార్గంలో నడిచి ఉన్నత స్థాయి శిఖరాన్ని అధిరోహించాలని కోరారు. యువత డ్రగ్స్ గంజాయి లాంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా కాపసాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ప్రతి విద్యార్థి తన గోల్‌ను నియమించుకొని ఉన్నతస్థాయికి ఎదిగి తన అమ్మ నాన్నలను సంతోష పెట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మత్తు పానీయాలు సేవించిన ప్రతి వ్యక్తి అనేక రోగాలకు గురికావడం, మతిస్థిమితం పోవడం, మత్తులో ఎటువంటి పని చేస్తామో తెలియకపోవడం జరుగుతుంది. కాబట్టి యువకులు, విద్యార్థులు ఇలాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఎల్లప్పుడు మంచి మార్గంలో నడవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు, ఎస్సై శంకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మా, ఎంఈవో సుభాష్, సీడీపీవో రాజశ్రీ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థిని విద్యార్థులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి భైంసాలో ఖేల్‌కూద్ పోటీలు

● పాల్గొననున్నవెయ్యి మందికి పైగా క్రీడాకారులు

భైంసా, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో మంగళవారం నుంచి మూడు రోజులు పాటు శ్రీసరస్వతీ విద్యా సంస్థల రాష్ట్ర స్థాయి ఖేల్‌కూద్ పోటీలు జరుగనున్నాయి.సోమవారం శ్రీ సరస్వతీ విద్యాపీఠం రాష్ట్ర ఆకాడమిక్ ఇన్‌చార్జీ కృష్ణమాచారి భైంసాలో విలేకరుల సమావేశం నిర్వహించి ఖేల్‌కూద్ పోటీల వివరాలను వెల్లడించారు. భైంసా పట్టణంలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల వేదికగా ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఇందులో రాష్ట్ర పరిధిలోని అన్ని ప్రాంతాలకు చెందిన శ్రీ సరస్వతీ శిశు మందిర్ విద్యా సంస్థలకు చెందిన వేయి మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని వివరించారు. .కబడ్డీ, ఖోఖో ,వాలిబాల్,షటిల్, చెస్, యోగాకు సంబంధించిన ఆటల పోటీలు జరుగుతాయని తెలిపారు. మూడు విభాగాలకు సంబంధించి పోటీలు జరుగుతాయని వివరించారు. ఖేల్‌కూద్ పోటీలను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభిస్తారని తెలిపారు. సభాధ్యక్షులుగా శ్రీ సరస్వతీ విద్యా పీఠం ఆదిలాబాద్ విభాగ్ అధ్యక్షులు భజరంగ్ ఆగర్వాల్ వ్యవహరిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి పి.రామరావ్, భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, అర్అండ్‌బీ డిప్యూటీ ఇంజనీర్ వాగ్మారే సునీల్ బాబు ప్రత్యేక ఆహ్వానితులుగా హజరవుతారని తెలిపారు. ప్రబంధకారిణి ఆధ్వర్యంలో ఆటల పోటీల నిర్వాహణ, క్రీడాకారుల బసకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తయినట్లుగా తెలిపారు.

ఆర్జీయూకేటీలో తరగతులు ఆలస్యం

● కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికాక వాయిదా

బాసర, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో ఈ ఏడాది కొత్తగా చేరినా విద్యార్థులకు సోమవారం నుండి తరగతులు ప్రారంభం కావాల్సి ఉంది.కానీ అధికారులు వాయిదా వేశారు.తదుపరి తేదీని తెలియకజేస్తామని సోమవారం ప్రకటించారు.బాసర క్యాంపస్‌తో పాటు మహబూబ్‌నగర్‌లో కొత్తగా ఈ ఏడాది ఏర్పాటుచేస్తున్న సెంటర్‌లో ఒకేసరా తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.అప్డేట్ కోసం విద్యార్థులు యూనీవర్సిటీ వెబ్‌సైట్ చూస్తూండాలని సూచించారు.అయితే ప్రత్యేక కేటాగిరి విద్యార్థుల కౌన్సెలింగ్ పూర్తికాకపోవడం వల్లనే అధికారులు వాయిదా వేసినట్లు సమాచారం.

మెట్రిక్ టన్ను ఆయిల్‌పామ్ ధర రూ.18,052

నిర్మల్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఒక్క మెట్రిక్ టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ. 18,052 నిర్ణయించినట్లు జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి బీవీ. రమణ పత్రిక ప్రకటనలో సోమవారం తెలిపారు. జిల్లాలోని ఆయిల్ ఫామ్ కోతలను ప్రారంభించిన రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ధరను సద్వినియోగపరచుకోవాలని తెలిపారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు

నిర్మల్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అవుట్ రిచ్ మ్యాప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు సంస్థ సెక్రటరీ కారోలిన్ విగ్ తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ వద్ద గల సాహృదయ సేవింగ్ సెంట్‌లో ఉచితంగా 20 మందికి కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్‌తో పాటు కుట్టు మిషన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి. ముత్యం రెడ్డి, తక్కల రమణారెడ్డి, సంస్థ ఆర్గనైజర్ రత్నం పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

● కుభీర్ ఎస్సై కృష్ణరెడ్డి

కుబీర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావద్దని స్థానిక ఎస్సై కృష్ణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై కృష్ణరెడ్డి మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తమ గోల్ ఎంచుకొని సాధించేందుకు తల్లిదండ్రుల ఆశయ సాధనకు చదువుల్లో రాణించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమాజ సేవకు పాటు పడాలని ఆయన సూచించారు. అపరిచిత నెంబర్ల నుండి లింకులు, సందేశాలు ఫోన్‌కాల్స్‌వస్తే వాటిని నమ్మి మోసపోవద్దని తెలిపారు. సైబర్ నేరాల వల్ల కలిగే అనార్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, ఏఎస్సై లక్ష్మణ్, అధ్యాపకులు సంపత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధుల బహిష్కరణ

కుంటాల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది సోమవారం విధులను బహిష్కరించారు. గత 5 నెలలుగా వీరికి వేతనాలు అందకపోవడంతో విధులను బహిష్కరించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రిన్సిపల్‌కు వినతిపత్రం అందజేశారు.



మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగిస్తున్న ఎస్పీ

చోరీకి గురైన 70 ఫోన్ల అప్పగింత

● ఐటీ కోర్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ

నిర్మల్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి నెల రోజుల్లో 70 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధుతలకు అందజేయడం జరిగిందని ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. సెల్ ఫోన్ పోయినా.. చోరీకి గురైన ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరీకి గురైన 70 మొబైల్ ఫోన్లు (సుమారుగా రూ.8 లక్షల 40 వేల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు. ఎస్పీ మొబైల్ వినియోగదారులను అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరిగతిన పట్టుకోవడానికి సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సీఈఐఆర్ వెబ్‌సైట్ వినియోగదారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 1,566 ఫోన్లు (సుమారుగా రూ.కోటీ 48 లక్షల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందన్నారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ ఫోన్‌లను దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటీ కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

నిర్మల్ రూరల్ ఐకేపీ ఏపీఎంగా అరుణ

నిర్మల్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐకేపీ కార్యాలయంలో రూరల్ మండల ఏపీఎంగా అరుణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె ఇంతకుముందు మామడ మండలంలో ఏపీఎంగా పని చేసి బదిలీపై వచ్చారు. రూరల్ ఏపీఎంగా పని చేసిన బోసు దిలావర్‌పూర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేసి ఐకేపీ సిబ్బంది ఏపీఎం అరుణకి స్వాగతం పలికారు. ఇందులో మండల అధ్యక్షురాలు స్వప్న, కార్యదర్శి లక్ష్మీ, కోశాధికారి రబియాబి, ఐకేపీ సీసీలు నర్సయ్య, జ్యోతిర్మయి, రేఖ, భోజన్న, అకౌంటెంట్ సుజిత, ఆపరేటర్ రవి ఉన్నారు.

● దిలావర్‌పూర్ ఐకేపీ ఏపీఎంగా బోసు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ మండల ఐకేపీ ఏపీఎంగా బోసు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఏపీఎంగా పని చేసిన సులోచన రెడ్డి బదిలీపై తానూర్ మండలానికి వెళ్లగా నిర్మల్ నుంచి బోసు దిలావర్‌పూర్ ఏపీఎంగా బదిలీపై వచ్చారు. కాగా నూతన ఏపీఎం బోసును చైతన్య మండల సమాఖ్య అధ్యక్షురాలు ముస్కు సునీత, సభ్యులు, సీఏలు పోశెట్టి, సాయన్న, ముత్యం, మహేష్, గంగాధర్‌లు కార్యాలయం సిబ్బంది సన్మానించారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

● ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రతి దరఖాస్తును పరిశీలించి తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరిం చాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పని చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. కాలానుగుణ వ్యాధులు నియంత్రించేందుకు పకడ్బందీ ప్రణాళికలను అమలు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటికే మూడుసార్లు జ్వర సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. పెంబి మండలానికి జాతీయ స్థాయిలోనే ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో కాంస్య పతకం రావడంతో ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. అధికారుల సమిష్టి కృషితో ఈ విజయం సాధ్యమైందన్నారు. పెంబి ఆస్పిరేషన్ బ్లాక్ జాతీయ స్థాయిలో మంచి స్థానంలో నిలవడంలో ఫ్రంట్ లైన్ వర్కర్స్ కృషి గర్వించదగ్గదన్నారు. గవర్నర్ చేతుల మీదుగా కాంస్య పతకాన్ని స్వీకరించినందుకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లను జిల్లా అధికారుల సంఘం తరఫున సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున అవయవదానానికి ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన వైద్య, ఆరోగ్య శాఖ రిటైర్డ్ ఉద్యోగి జొన్న వినోద్ కుమార్ దంపతులు మరణానంతరం వారి దేహాలను నిర్మల్ వైద్య కళాశాలకు విద్యార్థుల శిక్షణ కొరకు దానం చేయనున్నట్లు తెలిపారు. తన దేహాన్ని మరణానంతరం దానం చేయడం ఎంతో గొప్ప విషయమని తెలిపారు. దీని ద్వారా వైద్య కళాశాల విద్యార్థులకు శిక్షణ, శాస్త్రీయ పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

విద్యాశాఖకు సహకారం అందించండి

● జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

నిర్మల్ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు ఎల్లవేళలా విద్యాశాఖకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. విద్యాశాఖలో జరుగుతున్న అన్ని పనులలో తమవంతు సహకారం అందించాలని, అన్ని సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులకు ఆయన తెలిపారు. జిల్లాలో అమలవుతున్న ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్, విద్యా కార్యక్రమాల అమలు, బాలశక్తి, వర్క్ అడ్జస్మెంట్, పదోన్నతులలో తమవంతు సహాయ సహకారాలు విద్యాశాఖకు అందించి, జిల్లాను ముందుండేటట్టు చూడాలని వారిని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏవో వెంకటరమణారెడ్డి, ఏసీజీ మూడారపు పరమేశ్వర్, విద్యాశాఖ సమన్వయకర్తలు, అన్ని ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయండి : ఫోరం నాయకులు

ఖానాపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వైస్ చైర్మన్ పాకాల రాంచందర్ కోరారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ఖానాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్, గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిల సమక్షంలో నేతలకు రాంచందర్ వివరించారు. తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని ఆయన కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలను కోరారు.


అంగన్‌వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు



నర్సాపూర్(జి) అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన చేస్తున్న దృశ్యం

● గర్భిణులే, బాలింతలకు అన్నప్రాసన ప్రాముఖ్యతపై అవగాహన

నర్సాపూర్(జి), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసి పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీ గర్భిణులకు, బాలింతలకు అన్నప్రాసన ప్రాముఖ్యత గురించి వివరించారు. అన్నప్రాసన అనేది శిశువుల ఎదుగుదలకు ఎంతో కీలకమని, ఆరు నెలల తర్వాత పసి పిల్లలకు తల్లిపాలతో పాటు ఘన పదార్థాలు కూడా తినిపించడం మొదలు పెట్టాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన తల్లులకు, గర్భిణీలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత గురించి కూడా ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లిపాల వారోత్సవాల ప్రాధాన్యతను, పసిపిల్లల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.



తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

పెంబి: మండలంలోని చింతగూడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ భూక్యా సునీత గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాల గురించి అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యమన్నారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గౌతమి, సురేష్ రెడ్డి, రాజ్ కుమార్, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర కో-కన్వీనర్ తిరుపతి

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సేవలు ప్రశంసనీయం

ఉట్నూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఉట్నూర్ ఐటీడీఏ పేరు సంపూర్ణత అభియాన్ కార్యక్రమం ద్వారా మంచి గుర్తింపు తేవడంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా సేవలు ప్రశంసనీయమని ఆదివాసీ పీవీటీజీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ కుడిమెత తిరుపతి అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు రూ.5కే పౌష్టికరమైన భోజనం అందించడం ద్వారా స్కోచ్ అవార్డు లభించిన్నారు. సమావేశంలో ముకుందరావు, మరుసుకోల బాపురావు, మడావి రాజేశ్వర్, టేకం మారుతిలు పాల్గొన్నారు.

'జాబ్‌క్యాలెండర్ పేరుతో నట్టేట ముంచారు'

ఉట్నూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణిరాజేష్ విమర్శించారు. సోమవారం బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజక వర్గ ఇన్‌చార్జీ భుక్యజాన్సన్ నాయక్, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లుశ్రీనివాస్‌యాదవ్‌ల ఆదేశాల మేరకు ఉట్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి బీఆర్‌ఎస్‌వీ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ నాయకులు సాజిద్,బాబాశ్యామ్, అజ్మీరా జయచంద్ర, నరేష్, సూర్యకాంత్‌యాదవ్, దినేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఇచ్చోడ, ఆగస్టు, 4 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 9న ఇచ్చోడ మండల కేంద్రంలో నిర్వహించతలపెట్టిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా కొమురంభీం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు ఆత్రం మహేందర్, కొడప నగేష్, భీంరావ్, దేవ్‌రావ్, రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆదిలాబాద్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త నరేందర్‌రెడ్డి పెద్దన్న బడాల విశ్వనాథ్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా మాజీ మంత్రి జోగురామన్న సోమవారం మహారాష్ట్రలోని లింగి గ్రామానికి వెళ్లి పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట యాసంనర్సింగ్‌రావు, కల్చప్‌రెడ్డి తదితరులున్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు సోదరుడు రాథోడ్ నర్సింగ్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో తనువు చాలించడంతో విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖ నాయక్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డిలు పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి రాథోడ్ బాపూరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు సునీల్ జాదవ్, ధర్మపురి చంద్ర శేఖర్, కనక ప్రతిభ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ భార్యమృతి

భీంపూర్,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన ఆర్మీ జవాన్ పిట్ల నవీన్ ఉత్తరాఖండ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతని భార్య పిట్ల సుష్మా (29) అనారోగ్యంతో అక్కడి ఆర్మీ ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఆదివారం సాయంత్రం మృతి చెం

భారీ వాహనాలకు త్వరలో అనుమతులు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్‌జోన్‌లో భారీ వాహనాలకు త్వరలో అనుమతులు వస్తాయని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర అటవీ శాఖ వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకకు సహకరించాలని, అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో ఉండే ఆదివాసులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చట్టంలో ఉందన్నారు. తనకు తెలవకుండా కవ్వాల్ టైగర్ అడవి నుంచి ఆలీనగర్ ఆదివాసులను పునరావాసాలకు తరలించడం మంచిది కాదన్నారు. మైసంపేట ఆదివాసులను పునరావాసంకి తరలించి భూ సమస్య పరిష్కారం చూపలేదన్నారు. కొన్ని దశాబ్దాలుగా పోడు భూముల సాగు చేస్తున్న ఆదివాసులను, ఆదివాసీ ఏతరులను ఇబ్బంది పెట్టకుండని అలా చేయడం ద్వారా ప్రభుత్వం బద్నామ్ అవుతుందని, అలా చేయడం మంచిది కాదన్నారు. వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కోరినట్లు తెలిపారు.

మల్టీలెవల్ మోసంలో ఇద్దరి అరెస్టు

ఉట్నూర్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : డ్రీమ్ డాలర్ లైఫ్‌టోకెన్ అప్లికేషన్ ద్వారా మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితుల పై కేసు నమోదు చేశారు పోలీసులు. ఇద్దరిని అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నారని ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ మండలం షాంపూర్‌కు చెందిన ముండే నారాయణ, అదే గ్రామానికి చెందిన చాకటి సంగ్రామ్, మహారాష్ట్రలోని వనికి చెందిన రితేష్ వాతీకర్‌ల పై కేసులునమోదు చేశామని, షాంపూర్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, వనికి చెందిన వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర వనికి చెందిన రితేష్‌వాతేకర్ అనే వ్యక్తి ద్వారా ఉట్నూర్ మండలం షాంపూర్‌కు చెందిన చాకటే సంగ్రామ్, మొండే నారాయణ అనే వ్యక్తులు మల్టీలెవల్ మార్కెటింగ్‌లోని అప్లికేషన్‌లో రూ.1500లను కట్టి రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈ ఇరువురు నిందితులు ఈ మల్టీలెవల్ మోసాల్లో పాలు పంచుకుని దాదాపు 11 మంది వ్యక్తులను ఇందులో చేర్పించి మోసానికి పాల్పడినట్లు తెలిపారు. కేసు విచారణలో ఉట్నూర్ సీఐ ఎం.ప్రసాద్, ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారన్నారు.

ఒకరి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఎనిమిదేళ్ల జైలు

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి వ్యక్తి మృతికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్‌కు 8 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.11 వేల జరిమానా విధిస్తూ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి సీఎం రాజ్యలక్ష్మి తీర్పునిచ్చారు. లైజన్ అధికారి ఎం. గంగా సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2021 ఏడాది జూలై 26న పట్టణంలోని రైతుబజార్‌లో కూరగాయలు తీసుకుని నవీద్ అహ్మద్ రామ్ నగర్ లోని తన ఇంటికి వెళ్లే సమయంలో కలెక్టర్ చౌరస్తా వద్ద నిందితుడు సురేతర్ సంతోష్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడుపుతూ వెనక నుంచి ప్రమాదం చేయడంతో మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చార్జ్ షీట్ దాఖలు చేయగా... కోర్టు డ్యూటీ అధికారి ఎం.అశోక్ ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. పీపీ షాహినా సుల్తానా కేసును వాదించారు. ఈ మేరకు సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి సీఎం రాజ్యలక్ష్మి ముద్దాయి సంతోష్‌కు ఎనిమిది సంవత్సరముల కఠిన కారాగార శిక్ష, రూ. 11 వేల జరిమానా విధించారు. వాహన యజమాని బ్రహ్మకంటి శివమణికి రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నేరస్తులకు శిక్షలు పడడంలో తమ వంతు పాత్ర పోషించిన ప్రస్తుత వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్, కోర్టు మానిటరింగ్ ఆఫీసర్ ఎస్.ఎ బాకీ, కోర్టు లైజన్ అధికారి గంగా సింగ్, కోర్టు డ్యూటీ అధికారి ఎం.అశోక్ లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు అభినందించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సమ్మె చేపట్టారు. కార్మికుల పెండింగ్ బిల్లులు, కోడిగుడ్ల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో శ్రీదేవి, రాం బాయి పాల్గొన్నారు.

యూనివర్సిటీ ఆవశ్యకతపై అవగాహన

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో యూనివర్సిటీ ఆవశ్యకత గురించి యూనివర్సిటీ సాధన సమితి ఆధ్వర్యంలో బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా విద్యార్థులకు స్థానికంగానే అత్యుత్తమ విద్య అందాలంటే యూనివర్సిటీ తప్పనిసరిని కార్యక్రమ అతిథులు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ సాధన సమితి కన్వీనర్ బద్దం పురుషోత్తం రెడ్డి, కో-కన్వీనర్ రమణ గౌడ్, సలహాదారు సుహాసిని రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సూరజ్ సింగ్, పర్వేజ్, డాక్టర్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు శిశుమందిర్ విద్యార్థులు

బజార్‌హత్నూర్,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి):ఈ నెల 5, 6,7 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి ఖేల్‌కుద్ పోటీలలో బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని శిశుమందిర్ విద్యార్థులు పాల్గొంటున్నట్లు ఆదిలాబాద్ విభాగ్ ఖేల్‌కూద్ ప్రముఖ్ పోర్ని వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లాలోని భైంసా కిసాన్‌గల్లీలో జరిగే ఈ రాష్ట్ర స్థాయి ఖేల్ కూద్ పోటీల్లో కబడ్డీ విభాగంలో బాలురు, ఖోఖో విభాగంలో బాలికలు పాల్గొంటున్నారన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


గురుసాహెబ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆడే గజేందర్

నేరడిగొండ, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్దాపూర్ గ్రామంలో సోమవారం మథుర సమాజ్ నాయక్‌బాసన్‌దాస్ ఇంటి వద్ద జరిగిన గురుసాహెబ్ కార్యక్రమంలో పాల్గొన్న బోథ్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ఆడే గజేందర్. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆయన వెంట బోథ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ త్రిత్రేనారాయణ్‌సింగ్ సీనియర్ నాయకులు సాబ్లెకైలాస్, సాబ్లె అందుసంగ్, కిషన్‌సింగ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, ఎండీ సద్దాం, మౌలానా, బోథ్ నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దంపోతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక బజార్‌లు.. ఇంకెప్పుడు?

(5వ పేజీ తరువాయి...)

లోడ్ పాయింట్‌గా అధికారులు గుర్తించారు. అయితే దూరభారం పెరిగిపోవడంతో దీనిపై ఇంకా సందిగ్ధమే కనిపిస్తుంది. మంచిర్యాల నుంచి ఇసుక రవాణాకు ఇబ్బందులు ఎదురైతే నిజామాబాద్ నుంచి జిల్లాకు ఇసుకను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయిన ఇప్పటి వరకు ఇసుక లోడ్ పాయింట్లను ఎక్కడ ఫైనల్ చేయలేదు. ఇసుక బజార్‌లు అందుబాటులోకి వస్తే టన్ను నాణ్యమైన ఇసుక రూ.1600 నుంచి రూ.1800 వరకు ధర పలికే అవకాశం ఉంటుంది. మొదట జిల్లా కేంద్రంలో మూడు చోట్ల ఇసుక బజార్లను ఏర్పాటు చేసి.. ఆ తర్వాత మండలానికి ఒక ఇసుక బజార్‌ను ఏర్పాటు చేయాలని అధికారులు బావిస్తున్నారు. కానీ రవాణా భారం పెరిగి పోవడంతో ఇసుక బజార్లపై ముందడుగు పడడం లేదు.

నిలిచిపోతున్న నిర్మాణాలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఇబ్బందులు పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ఆశించిన స్థాయిలో నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా ఇసుక కొరతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోతున్నాయి. వర్షాకాలం కావడంతో స్థానికంగా ఇసుక అందుబాటులో లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఉన్న అటవీ శాఖ, మైనింగ్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొంటున్నారు. స్థానికంగా దొరికే ఇసుకతో ఇంటి నిర్మాణ పనుల నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత్యంతరం లేక స్థానికంగానే ఇసుకను కొనుగోలు చేస్తూ ఇళ్ల నిర్మాణాల్లో ఉపయోగిస్తున్నారు. మరికొంత మంది లబ్ధిదారులు వర్షాకాలం ముగిసేంత వరకు ఇళ్ల నిర్మాణాల జోలికి వెళ్లడం లేదు. అలాగే ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. పెట్టుబడి ఖర్చులు కూడా భారీగా పెరిగిపోవడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఇళ్ల నిర్మాణానికి కొందరు లబ్ధిదారులు వెనుకాడుతున్నారు.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బాసర ట్రిబుల్ ఐటీలో సీటు రాలేదన్న మనస్తాపంతో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోథ్ మండలం ధన్నూర్ గ్రామానికి చెందిన మునిమల వెంకటమ్మ కూతురు శైలజ (15) పదో తరగతిలో 563 మార్కులు సాధించి... ట్రిపుల్ ఐటీలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత నెల జరిగిన కౌన్సెలింగ్‌లో సీటు లభించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయింది. ఇదే క్రమంలో పట్టణంలోని అటెండర్స్ కాలనీలో గల తన బాబాయ్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

'మా సార్లు మాకే కావాలి'

భీంపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):భీంపూర్ మండలం మారుమూల కరంజిటి ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 120 మంది విద్యార్థులకు గాను సరిపడ ఉపాధ్యాయులు లేరు. ఇది వరకు ఇక్కడ ఉన్న టీచర్ల నుంచి ఒక మహిళ ఉపాధ్యాయురాలు ఇటీవలే సర్దుబాటులో అంతర్గాం పాఠశాలకు డిప్యూటేషన్ పై పంపారు. ఈ ఉపాధ్యాయురాలు త్వరలో అవసరమైన పనితో సెలవులో వెళ్లనున్నారని తెలసి తిరిగి ఆమెను కరంజిటికె పంపారు. మరో ఉపాధ్యాయుని కూడా కరంజి టి నుంచి అంతర్గాం పాఠశాలకు పంపుతున్నారు. దీనితో ఇప్పుడు 120 మంది విద్యార్థులకు ముగ్గురే ఉపాధ్యాయులే మిగిలారు. మా సార్లు మాకే కేటాయించాలని కోరుతూ తల్లిదండ్రులు, గ్రామపెద్దలు గుర్లనరేందర్‌యాదవ్, కొడిమెల దేవరెడ్డి, రెడ్డిరమేష్‌కల్చప్‌యాదవ్‌లు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా ఈ విషయంలో తాము జిల్లా కలెక్టర్, డీఈఓలకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

'పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి'

నేరడిగొండ, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటువేయాలని సోమవారం అసెంబ్లీలోని గాంధీ విగ్రహం ఎదుట జరిగిన ధర్నాలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ప్రతినిధి బృందంలో బోథ్ ఎమ్మెల్యే ఉన్నారు.


పూర్వ విద్యార్థికి సన్మానిస్తున్న యాజమాన్యం

పదో తరగతి పూర్వ విద్యార్థికి ఘన సన్మానం

నిర్మల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సాగర్ కాలనీలో గల ఎస్‌ఆర్ డీజీ పాఠశాలలో పదో తరగతి పూర్వ విద్యార్థి శక్కెర శివ ప్రియకు పాఠశాల యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించినట్లు జోనల్ ఇన్‌చార్జి నగేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇటీవల విద్యార్థిని శివప్రియ బాసర ట్రిపుల్ ఐటీలో సాటు సాధించడంతో పాలీసెట్ బైపీసీ విభాగంలో 220, ఎంపీసీ విభాగంలో 494 ర్యాంక్, టీఎస్ ఆర్‌జేసీలో 23వ రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిందని తెలిపారు.

'స్తంభాలను దూరంగా ఏర్పాటు చేయండి'

నిర్మల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆదర్శనగర్‌లో జనావాసాలకు ఆనుకుని 33/11 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి తీగలను అమర్చుతుండడంతో తమకు ప్రాణాపాయం ఏర్పడుతుందని అడిషనల్ కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు కాలనీ కమిటీ అధ్యక్షుడు కుర్ర నరేష్ తెలిపారు. దీనిపై చర్యలు తీసుకొని తమను విద్యుత్ ప్రమాదాల నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, డాక్టర్ ప్రభాకర్, గొజ్జ గంగాధర్, నుచ్చ రామకృష్ణ, నల్లెడ రాజశేఖర్ రావు, స్థానికులు పాల్గొన్నారు.

'నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి'

నిర్మల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బీసీసీఐ నుంచి క్రికెట్ అభివృద్ధి కోసం విడుదలయ్యే నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కోచ్ రామరాజు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సోమవారం నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్‌లోని వివిధ జిల్లాల కార్యదర్శులు సీఐడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వులతో తెరిచిన హోటల్

నిర్మల్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ఉత్తర్వుల ద్వారా గ్రిల్ నైన్ హోటల్ తెరిచినట్లు సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎన్. దేవదాసు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గత సంవత్సరం నవంబరు 7న ప్రజల ఆరోగ్యం దృష్ట్యా హోటల్‌ను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. హోటల్ ఓనర్ లక్ష్మీ హైకోర్టు ద్వారా ఉత్తర్వులు పొందారని, అట్టి ఉత్తర్వుల ద్వారా పురపాలక సంఘం నిర్మల్ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది వెళ్లి గ్రిల్ నైన్ హోటల్‌ను తెరిచామని తెలిపారు.

స్వగ్రామానికి తిరిగి వచ్చిన మల్లయ్య

సారంగాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సారంగాపూర్ మండలంలోని చించోలి గ్రామానికి చెందిన నడిపి లింగన్న మల్లవ్వ దంపతుల కుమారుడు మల్లయ్య 20 సంవత్సరాల క్రితం మతిస్థిమితం లేక ఇళ్లు వదిలి పోయాడు. ఆదివారం ఓ సంస్థ చొరవతో ఇంటికి చేరుకున్నాడు. మతిస్థిమితం లేక ఇళ్లు వదిలి పోయిన మల్లయ్య తల్లి తమ్ముడు మరణించడంతో అక్కబావలే ఆయనను దగ్గర తీసుకెళ్లి తోడుగా నిలిచారు. మల్లయ్య తండ్రి లింగన్న గత 32 సంవత్సరాల క్రితం ఉపాధి కోసం సౌదికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కూడా తెలియడం లేదు. దీంతో మల్లయ్య అనాదగా మారాడు.

బస్సు ఎక్కుతుండగా పర్సుల చోరీ


బస్సులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఖానాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ బస్టాండ్‌లో సోమవారం సాయంత్రం జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. వివరాల్లోకి వెళ్తే బాధితులు తెలిపిన కథనం ప్రకారం... ఖానాపూర్ బస్టాండ్‌లో ఎర్వచింతల్ వెళ్లే బస్సు రాగానే బస్సు ఎక్కేందుకు ఒక్కసారిగా ప్రయాణికులంతా గుమిగూడారు. మంజుల, వనిత అనే ఇద్దరు మహిళల వద్ద నుండి పర్సులను అపహరించారు. మంజుల పర్సులో రూ. 12 వేల నగదు ఉండగా, వనతి పర్సులో రూ. 500లు, ఏటీఎం కార్డు, ఆధార్ కార్డు ఉన్నట్లు బాధితులు తెలిపారు. ఘటన స్థలాన్ని ఖానాపూర్ పోలీసులు సందర్శించి బస్సును పరిశీలించారు. ఈ విషయమై ఎస్సై రాహుల్ గైక్వాడ్‌ను వివరణ కోరగా దొంగతనం జరిగినట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది బస్టాండ్ వెళ్లి తనిఖీ నిర్వహించినట్లు పేర్కొన్నారు. బాధిత మహిళల నుంచి ఎటువంటి లిఖిత పూర్వక ఫిర్యాదు రానందున ఇంకా కేసు నమోదు చేయలేదన్నారు.

యాత్రల పేరుతో మోసం

● బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లో సాగించినది జనహిత పాదయాత్ర కాదని కాంగ్రెస్ పార్టీ పోరు యాత్ర అని బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. సోమవారం ఖానాపూర్‌లోని జాన్సన్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నాడు అసెంబ్లీ ఎన్నికల ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రతి ఇంటింటా తిరుగుతూ బాండ్ పేపర్లతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి రాగానే ఆ బాండ్ పేపర్లను బుట్ట దాఖలు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అబ్దుల్ మోహిద్, మాజీ వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, పార్టీ పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, జిల్లా నాయకులు కొక్కుల ప్రదీప్, శనిగారపు శ్రావణ్, కారింగుల సుమన్, పుప్పాల గజేందర్, సల్ల నరేందర్ రెడ్డి, దివాకర్, సోయబ్, వాహబ్, జహీర్, తదితరులున్నారు.

కాంగ్రెస్ నాయకుల విహారయాత్ర

● బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్

ఖానాపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జనహిత యాత్ర పేరిట ఆదివారం సాయంత్రం ఖానాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన పాదయాత్ర విహార యాత్రలా సాగిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. సోమవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఖానాపూర్ ప్రాంతంలో నెలకొన్న ఏ ఒక్క సమస్యను గాని కాంగ్రెస్ నాయకులు పరిష్కరించే దిశగా ఈ జనహిత యాత్రలో హామీ ఇవ్వలేకపోయారన్నారు. కేవలం అధికార బలాన్ని ప్రదర్శించేలా పోలీసులతో చుట్టూ వలయాన్నీ ఏర్పరచుకొని ప్రజలను దూరంగా ఉంచుతూ యాత్రను సాగించారన్నారు. ఎన్నికలకు ముందు సదర్మాట్ ప్రత్యేక కెనాల్ హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం జనహిత యాత్రలో దాని ఊసెందుకు ఎత్తలేదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గం కన్వీనర్ అంకం మహేందర్, మండల అధ్యక్షులు పుప్పాల ఉపేందర్, గడ్డం రవీందర్, శ్రావణ్, స్వామి, అనిల్, శ్రీనివాస్, వెంకట్రాములు, తదితరులున్నారు.

'దుబాయి నుంచి ఇంటికి రప్పించండి'

ఖానాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : దుబాయ్‌లో రోడ్డు ప్రమాదం బారిన పడి తీవ్ర గాయాలతో మంచం పట్టిన రాజేందర్‌ను స్వదేశానికి రప్పించాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు సోమవారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌ను కలిశారు. పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన రెంకల రాజేందర్ జూన్ 24వ తేదీన దుబాయ్ దేశానికి వెళ్లాడు. అక్కడ ప్లంబర్‌గా పని చేస్తుండగా జూన్ 29వ తేదీన రోడ్డు ప్రమాదంలో కుడికాలు విరిగి మంచం పట్టాడని, ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని రాజేందర్ భార్య మల్లీశ్వరి, తల్లి పెద్దక్కలు సోమవారం జాన్సన్ నాయక్‌ను కలిసి తమ ఆవేదనను తెలిపారు.

ఆలయంలో చోరీకి యత్నం

దిలావర్‌పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : దేవుడి గుడికి కన్నం పెట్టాలని చూసిన ఘనుడిని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే దిలావర్‌పూర్‌లో పురాతన ఆలయమైన ఏక్‌నాథ్ మందిరంలో గుడిలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి తాళం పగులగొట్టి, గుడిలోకి ప్రవేశించారు. హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న రూ. 1,000లను దొంగతనం చేశారు. అనంతరం పెద్ద హనుమాన్ మందిరానికి వెళ్లి తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తుండగా అలికిడికి ఆలయం పక్కనే ఇంట్లో నిద్రిస్తున్న పండరి అనే యువకుడికి మెలకువ వచ్చి చూశారు. తాళం పగులగొట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు గమనించి మిగతా వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వెంటనే అందరూ కలిసి దుండగుడిని పట్టుకుని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఎస్సై రవీందర్ నిందితుడిని రిమాండ్ చేశారు.

ముథోల్‌లో పశువుల చోరీ

ముథోల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని ముక్తాదేవి కాలనీలో ఆదివారం రాత్రి హంగిర్గా భోజన్నకు చెందిన రెండు ఎడ్లు, ఒక ఆవును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం... హంగిర్గా భోజన్న తన రెండు ఎడ్లను, ఒక ఆవును రోడ్డు పక్కన ఉన్న నీటి ట్యాంక్ కింద కట్టేశాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి ఈ మూడు పశువులను దొంగిలించారు. ఈ విషయాన్ని గమనించిన బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పుర్కొన్నారు.

చక్రలింగేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

నర్సాపూర్(జి), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టెంబుర్ని గ్రామంలో ఉన్న శ్రీ చక్రలింగేశ్వర స్వామి ఆలయంలో రిటైర్డ్ టీచర్ నిమ్మల విజయ నరేందర్ రెడ్డిలు అన్న ప్రసాదం అందించారు. శ్రావణ మాసం రెండోసోమవారం సందర్భంగా అన్నదాతగా ఆయన ముందుకు వచ్చి, గ్రామస్థులందరికీ అన్నప్రసాదం వితరణ చేశారు. ఇతర ప్రముఖులు అన్నదాత నిమ్మల విజయ నరేందర్ రెడ్డికి, వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

స్కూటీ డిక్కీలో నుంచి రూ.5 లక్షల చోరీ

● బార్ ముందు స్కూటీ ఆపి లోనికి వెళ్లి వచ్చే లోపు ఘటన
● డిక్కీ తెరిచి డబ్బుతో ఉడాయించిన ఆగంతకులు
● బాధితుడు ముథోల్ మండలం ఎడ్‌బిడ్ నివాసి


బైక్‌పై ఉడాయిస్తున్న చోరులు

భైంసా, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలోని సాయిలక్ష్మీ బార్ అండ్ రెస్టారెండ్ వద్ద సోమవారం పట్టపగలు చోటు చేసుకున్న చోరీ ఘటన సంచలనం రేపింది. ముథోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన బొంబొతుల ఆనంద్ (45) ఇక్కడి యూనియన్ బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసుకొని స్కూటీపై ఇంటికి వెలుతుండగా చోరీఘటన జరిగింది. బాధితుడు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమెరికాలో ఉంటున్న కూతురు రూ.10 లక్షలు తన అకౌంట్‌కు పంపగా బొంబొతుల ఆనంద్ సోమవారం మధ్యాహ్నం భైంసా యూనియన్ బ్యాంక్ నుంచి రూ.5 లక్షలు డ్రా చేసుకున్నాడు. సంబంధిత నగదును తన స్కూటీ డిక్కిలో పెట్టుకొని స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గమధ్యలో భైంసా పట్టణ సరిహద్దులోని సాయిలక్ష్మీ బార్ అండ్ రెస్టారెంట్ ముందరి భాగంలో తన స్కూటీని నిలిపి లోనికి వెళ్ళాడు. ఇదే సమయంలో బైక్ పై వచ్చిన ఇద్దరు ఆగంతకుల్లో ఒకరు స్కూటీ వద్దకు వచ్చి డిక్కీని తెరిచి అందులోని రూ.5 లక్షల నగదును తస్కరించాడు. అనంతరం బార్ అండ్ రెస్టారెంట్ ముందు బాగం నుంచి తాపీగా నడుచుకుంటూ వెళ్లి అక్కడికి బైక్ పై వచ్చిన సహచర మరో ఆగంతకునితో కలిసి ఉడాయించారు. బొంబొతుల ఆనంద్ డిక్కీ కొద్ది మేర తెరిచినట్లుగా ఉండటాన్ని గుర్తించాడు. అనుమానంతో పూర్తిగా తెరిచి చూడగా అందులో నగదు లేకుండా పోవడంతో లబోదిబోమంటూ అరిచాడు. అనంతరం డబ్బు చోరికి గురైనట్లుగా తెలుసుకున్న బాధితుడు బొంబొతుల ఆనంద్ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో కలిసి పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. టౌన్ సీఐ గోపినాథ్ దర్యాప్తు ప్రారంభించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి జవారే రాహుల్

భైంసా, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధి జవారే రాహుల్ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కేంద్రమైన భైంసాలో జరిగిన యూనియన్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పెండింగ్‌లోనున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లింపు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో యూనియన్ భైంసా డివిజన్ ప్రతినిధులు మహేష్, గంగా చరణ్; గణేష్ ప్రేమ్, సాయి కుమార్, ప్రశాంత్‌తో పాటు ఆయా మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాజీ విగ్రహం రంగు మార్చడం సరికాదు

ఖానాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రంగు మార్చి అవమానించడం ఎంతవరకు సమంజసమని బజరంగ్ దళ్ ఖానాపూర్ మండల శాఖ ప్రశ్నించింది. సోమవారం స్థానిక శివాజీ విగ్రహాన్ని బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో పాలతో శుద్ధి చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బజరంగ్ ప్రఖండ బలోపాసన ప్రముఖ్ తంగలపల్లి రాజశేఖర్, బజరంగ్ దళ్ ఖానాపూర్ మండల శాఖ నాయకులు భూమేష్, సాయి, ప్రణీత్, ప్రతాప్, తదితరులున్నారు.

సహజ వనరుల సంరక్షణ అందరి బాధ్యత

భైంసా రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : సహజ వనరుల సంరక్షణ అందరి బాధ్యత అని ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్ట్ దిగంబర్ అన్నారు. సోమవారం మాటేగాం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సమాజ సేవకులకు పర్యావరణ సంరక్షణ భావితరాలకు భరోసా అనే అంశానికి సంబంధించిన పుస్తకాలను వితరణ చేసిన సందర్భంగా మాట్లాడారు. సమాజ సేవకులు సహజ వనరుల సంరక్షణపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.



కదిలెలో పాపన్న దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

కదిలె 'పాపన్న'కు భక్తుల నీరాజనం

- జనసంద్రంగా కదిలె లొద్ది
- స్వామి దర్శనం కోసం బారులు

దిలావర్‌పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం శ్రీ కదిలె అన్నపూర్ణేశ్వరి సమేత పాపహరేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకునేందుకు సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రావణ మాసం రెండో సోమవారం కావడంతో గంట గంటకు భక్తుల సంఖ్య పెరిగింది. కదిలె లొద్ది భక్తజనసంద్రంగా మారింది. ఓంకార నాదంతో మార్మోగింది. శ్రీ కదిలె పాపహరేశ్వర స్వామి దర్శన భాగ్యం కోసం భక్తులు బారులు తీరారు. రెండు గంటల పాటు వరుసలో నిల్చున్నారు. గర్భాలయంలోని పాపహరేశ్వర స్వామి స్పర్శ దర్శనం కోసం పోటీ పడ్డారు. అభిషేక పూజలు చేశారు. అనంతరం శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి దేవిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 18 వృక్షాలతో కూడిన మహా వటవృక్షానికి ప్రత్యేక పూజలు చేసి ప్రదక్షిణలు చేశారు. భక్తులకు కుంటాల మండలం కల్లూరు గ్రామానికి చెందిన ఉత్తూరు హరిణి, శ్రీధర్ దంపతులు అన్న ప్రసాద వితరణ చేశారు. కాగా దేవస్థానం కార్యనిర్వాహణాధికారి భూమయ్య, జూనియర్ అసిస్టెంట్ మాధవ్ రావు పటేల్ భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. కదిలె పాపన్న సేవాదళ్ సభ్యులు భక్తులకు అవసరమైన సేవలందించారు.



కదిలెలో మహా వట వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

యోగా జీవన విధానంలో భాగమవ్వాలి

- ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్



యోగా జిల్లా కార్యవర్గ ప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం గాను ప్రతి ఒక్కరి జీవితంలో యోగా నిత్య జీవన విధానంలో ఒక భాగమవ్వాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని గౌతమీ హైస్కూల్ జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేటి ఉరుకులు, పరుగుల జీవన విధానంలో విశ్రాంతి కరువైందన్నారు. శరీరానికి శ్రమ లేకుండా పోతోందన్నారు. దీనికి తోడు విషతుల్యమైన ఆహారం, కలుషితమైన నీరు జనాల ఆరోగ్యానికి అనర్థదాయకంగా మారుతున్నాయన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల మూలంగా అధిక శాతం మంది రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. వీటన్నింటి నుంచి విముక్తి పొందేందుకు గాను ఆరోగ్యాలను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ యోగాను సాధనగా ఎంచుకోవాలన్నారు. ప్రతి నిత్యం క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు సైతం దూరమవుతాయన్నారు. యోగా పోటీలలో విద్యార్థులు వేసిన ఆసనాలను ఎమ్మెల్యే బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో శ్రీ గౌతమి హైస్కూల్ కరస్పాండెంట్ రవి కుమార్, ఆరోగ్య భారతి సంయోజకులు డా.ముష్కం రామకృష్ణ గౌడ్, వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యోగేష్, బీజేపీ ప్రతినిధులు సిరం సుష్మారెడ్డి, తూమొల్ల దత్తు, వెంగల్‌రావ్, యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, సంయుక్త కార్యదర్శులు ప్రభాకర్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యక్షగానం

బాసర, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీలో సోమవారం కర్ణాటక రాష్ట్ర అతి ప్రాముఖ్యమైన శాస్త్రీయ కళ అయినా యక్షగాన ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల దుస్తులు,ప్రత్యేక అలంకరణ, వివిధ రకాల ముసుగులు ధరించిన కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రామాయణంలోని సీతాపహరణం ఘట్టాన్ని ఆధారంగా తీసుకొని రావణుని అధర్మపు చర్యలు,సీతమ్మ త్యాగం, రామ లక్ష్మణుల బాధలను నాటకీయంగా నృత్య సంగీత సమన్వయంతో అత్యంత అద్భుతంగా చూపించారు. మూడు గంటల పాటు జరిగినా ప్రదర్శన ఆహూతులను ముగ్ధులను చేసింది. స్పీక్ మాకే సంస్థ 4వ కన్వెన్షన్‌ను బాసర క్యాంపస్‌లో నిర్వహించడం గర్వకారణమని వీసీ ప్రొ.గోవర్ధన్ అన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక అవగాహన పెంచడం, మానసిక ఉల్లాసం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కర్ణాటక నుంచి వచ్చిన కళాకారులను వీసీ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ సత్కరించారు.



పురాణఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



కళాకారుల సామూహిక ప్రదర్శన

ఆదివాసీ ఉపాధ్యాయుడు
తొడసం కైలాష్‌కు అరుదైన అవకాశం

- గౌరాపూర్ ఆదివాసీ ఉపాధ్యాయుడికి రాష్ట్రపతి పిలుపు
- గోండు భాషలో మహాభారతం
- 330 గోండు భాషలో పాటలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధించే ఆదివాసీ ఉపాధ్యాయుడు తొడసం కైలాష్‌కు అరుదైన అవకాశం దక్కింది. గోండి భాషలో పండోక్న మహాభారతం కథ పేరుతో మహాభారాతాన్ని అనువదించారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ 119వ మన్ కీ బాత్ కార్యక్రమంలో తొడసం కైలాష్ సేవలని కొనియాడుతూ ప్రశంసించారు. ఈ నెల 15న తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసే విందులో పాల్గొనేందుకు తొడసం కైలాష్‌కు ఆహ్వానం అందింది. సోమవారం ఉదయం రాష్ట్రపతి భవన్ నుంచి వచ్చిన లేఖను తొడసం కైలాష్ మావల మండలంలోని స్వగ్రామమైన వాఘాపూర్‌కు నిర్మల్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సందీప్, జిల్లా పబ్లిక్ రిలేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టల్ డిపార్ట్ రీయింబర్స్‌మెంట్ మహేష్, జిల్లా పోస్ట్‌మెన్ ప్రణయ్, వాఘాపూర్ పోస్ట్ మాస్టర్ సాయి, ఎంటీ మునీర్‌లు గ్రా మానికి వచ్చి ఆహ్వానం పత్రికను కైలాష్‌కు రాష్ట్రపతి లేఖను అందజేశారు.

గోండు భాషలో మహాభారతం, 330 గోండు, తదితర భాషాలో పాటలు

తొడసం కైలాష్ గతంలో తన మాతృ భాష అయిన గోండు భాషలో ఎపండోక్న మహాభారత్ కథా పేరుతో మహాభారాతాన్ని గోండు భాషలో అనువదించి పుస్తకాన్ని ఆవిష్కరించారు. కేవలం నాలుగు నెలల్లోనే మహాభారాతాన్ని గోండు భాషలో అది కూడ తన మొబైల్ ఫోన్ లోనే టైప్ చేశారు. ఈ పుస్తకంలో గతంలో వాడ బడి ప్రస్తుతం వాడుకలో లేని అంతరించే ప్రమాదంలో ఉన్న గోండి పదాలని వెలికి తీసి తన పుస్తకంలో రాశారు. దాంతో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి మన్ననలు పొందారు. అంతేకాకుండా గోండి, కొలామి, తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో కలుపుకొని ఇప్పటివరకు 330కి పైగా పాటలు రాసి వాటిని ఏఐతో పాడించి రికార్డ్ సృష్టించారు. తాను స్వరపరిచిన పాటలను యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్బుక్, పోస్ట్ చేశారు. ఆ పాటలు విన్న ఆదివాసీ యువతి, యువకుల నుంచి మంచి స్పందన లభించింది. పాటలు యువకులను, పెద్దలకు ఆలోచింపచేసేవిగా ఉన్నాయని స్పందన లభించింది. దేశ ప్రధాని ప్రధాని మోదీ తన 119 వ మన్ కీ బాత్ కార్యక్రమంలో తొడసం కైలాష్ సేవలని కొనియాడుతూ ప్రశంసించారు. టెక్నాలజీ వినియోగంలో భారతీయులు ఏం తక్కువ కాదని ఆ సందర్భంగా తొడసం కైలాష్ సేవలని ప్రశంసించారు. దాంతో కైలాష్ అందరి దృష్టిలో పడ్డారు. అప్పటివరకు కైలాష్ తన పనేదో తాను చేసుకుంటూ వచ్చారు. కైలాష్ ప్రధాని దృష్టిలోకి రావడంతో కైలాష్ ను స్ఫూర్తిగా తీసుకుని చాలా మంది యువకులు రచనల వైపు అడుగులు వేస్తున్నారు. గోండి భాష చదవడంలోని ఇబ్బందులను గుర్తించి తొడసం కైలాష్ వినూత్నంగా ఆలోచించి రాసిన చదివేది ఏదైనా ఉందా అని నెట్‌లో సెర్చ్ చేసిన తర్వాత కొన్ని అప్లికేషన్‌లతో పరీక్షించిన తర్వాత గోండి భాషను స్పష్టంగా చదివే అప్లికేషన్ కనుగొని దాంతో గోండి భాషను డెవలప్ చేశారు.





కైలాష్‌కు రాష్ట్రపతి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అధికారులు

గ్రామస్థుల ఆధ్వర్యంలో తొడసం కైలాష్ కు సన్మానం

ఆదివాసీ ఉపాధ్యాయుడు తొడసం కైలాష్‌కు ఈ అరుదైన అవకాశం దక్కడంతో వాఘాపూర్ గ్రామస్థులందరూ తరలి వచ్చి ఆయనకు శాలువాతో సత్కరించారు. చిన్న నాటి నుంచి కష్టపడే మనస్తత్వం తొడసం కైలాష్ ఉపాధ్యాయుడి పేదరికం నుంచి అంచనంచలుగా ఎదుగుతూ పట్టుదలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో మన వాఘాపూర్ గ్రామం పేరు ఉచ్చకరించేలా చేయడం గ్రామస్థులుగా గర్వాంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 15వ ఆగస్టు స్వతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చే విందు కార్యక్రమంలో రావాల్సింది గా తొడసం. కైలాష్‌కు తపాల శాఖ ఉద్యోగులు వచ్చి ఆహ్వానం ఇవ్వడం జరిగిందని చాలా గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చిలుకూరి సురేందర్ రెడ్డి, నక్కల పోతారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగేందర్, వాఘాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాహేబ్ రావు, గోండ్వానా సాహిత్య అకాడమీ అధ్యక్షుడు కొరెంగ దౌలత్ రావు, వైజాపూర్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

అరుదైన గౌరవంగా భావిస్తున్న: తొడసం కైలాష్



ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసి విందులో పాల్గొనేందుకు రావాలని ఆహ్వానం రావడం చాలా గర్వంగా ఉందని తెలిపారు. దీన్ని తన జీవితంలోనే అత్యంత అరుదైన గౌరవంగా అభివర్ణించారు.



రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శ్రావణ మాస వేళ పోటెత్తిన భక్తజనం

కుంటాల, ఆగస్టు, 4 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రం కుంటాల ఉమామహేశ్వర ఆలయంతో పాటు ఓలా శివాలయం, సూర్యాపూర్ రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో సోమవారం భక్తజనం పోటెత్తింది. శ్రావణ మాసం సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శివాలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న లక్కాడి జగన్మోహన్ రెడ్డి

నిర్మల్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. నిర్మల్‌లోని గండి రామన్న క్షేత్రంలో గల శివాలయంతో పాటు హరిహర క్షేత్రం, నగరేశ్వర వాడ శివాలయం, వెంకటాద్రిపేట్ ఓం కారేశ్వర ఆలయాల్లో సోమవారం ఉద యం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బూరుగుపల్లి శివాలయం, కదిలి పాపహరేశ్వర ఆలయాల్లో పూ జలు చేసేందుకు భక్తులు బారులు తీరారు. గండి రామన్న క్షేత్రంలోని శివాలయంలో సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసి శివలింగానికి అభిషేకం చేశారు. ఆయా ఆలయాల్లో పెద్ద సంఖ్య లో తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

సులువుగా జీవిత ధ్రువీకరణ పత్రం

Jeevan Pramaan
Digital Life Certificate for Pensioners

భైంసా, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జీవిత ధ్రువీకరణ పత్రాలకు ఇక ఇబ్బందులు పడాల్సిన పని లేదు. ఇంటి వద్దే ఫోన్‌లో తమకు కావాల్సినవి పొందవచ్చు. రోజురోజుకూ సాంకేతిక వినియోగం పెరుగుతోంది. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఇతర కార్మికులు పింఛన్ పొందేందుకు ప్రతీ సంవత్సరం జీవన ప్రమాణ్ పత్రం (లైఫ్ సర్టిఫికేట్) సమర్పించాల్సి ఉంటుంది. గతంలో పోస్టాఫీస్, మీ సేవ కేంద్రాల్లో సంబంధిత పత్రం తీసుకొనే వారు. పలు సాంకేతిక సమస్యలు, సిబ్బంది లేకపోవడం, తదితర కారణాలతో పత్రం తీసుకోవడంలో జాప్యం జరిగేది. ప్రస్తుతం ఈ ప్రక్రియ సులభతరమైంది.

● ఎలా పొందాలంటే...?

విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు ఎక్కడికీ వెళ్లకుండానే యాప్‌లో జీవన్ ప్రమాణ్ యాప్ ముఖ నమూనా గుర్తింపుతో లైఫ్ సర్టిఫికేట్ పొందవచ్చు. అందుకోసం ఆండ్రాయిడ్ 9.0 లేదా అంతకంటే ఎక్కువ వెర్షన్ ఫోన్ ఉండాలి. ప్లే స్టోర్‌కు వెళ్లి ఆధార్ ఫేస్ ఆర్డీ దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం జీవన్ ప్రమాణ్ యాప్‌లో పెన్షనర్ ఆధార్ కార్డు నంబర్, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. ఆధార్ అనుసంధానం ఉన్న ఫోన్‌కి ఓటీపీ వస్తుంది. అది నమోదు చేసి వివరాలను పొం దుపర్చాలి. తొలిసారిగా తమ జీవిత ప్రమాణ పత్రాన్ని పొందే పెన్షనర్లు పేరు, ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేయాలి. గతంలో సమర్పించిన వారి వివరాలు అప్పటికే ఉంటాయి. వాటిపై ఒకే అని నిర్ధారణ చేశాక మేసేజ్ వస్తుంది.



ఫొటో న్యూస్

నేరడిగొండ జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన పోలీసు జీపు, పోలీసు కటౌట్

కటౌట్ చూసి నమ్మాల్సిందే!

ఆదిలాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కటౌట్ చూసి కొన్ని కొన్ని నమ్మాల్సిందే డ్యూడ్.. అంటాడు ఓ తెలుగు సినిమాలో హీరో. అదే కటౌట్‌ను ఉపయోగించి రోడ్డు ప్రమాదాల నివారణకు పాటు పడతున్నారు జిల్లా పోలీసులు. జాతీయ రహదారిపై నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించిన పోలిసు యంత్రాంగం.. పోలీసు జీపు, ట్రాఫిక్ పోలిసు కట్ అవుట్‌లను రహదారి గుండా ఏర్పాటు చేశారు. పోలీసులు ఉన్నారన్న భయంతో అయినా వాహనదారులు నిబంధనలు పాటిస్తారన్న ఉద్దేశంతో వీటిని అక్కడక్కడ ఏర్పాటు చేయగా దగ్గరికి వచ్చి చూసి విషయం తెలుసుకున్న వాహనదారులు ఆశ్చర్యపోతున్నారు. ఏదైమైనా ప్రమాదాలతో ప్రా ణాలు కోల్పోకుండా పోలిసు శాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టడం మాత్రం అభినందన లు పొందుతోంది.

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ప్రమాదమని తెలిసినా తప్పని తెప్ప ప్రయాణం

- ఏడాదిలో ఎనిమిది మాసాలు తెప్ప ప్రయాణమే దిక్కు
- కడెం మండలం గంగాపూర్ పరిసర 10 గ్రామాల ప్రజలకు తప్పని తిప్పలు

ఖానాపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రమాదమని తెలిసినా వారికి ఆ ప్రయాణం తప్పదు.. ఆ గ్రామాలకు వెళ్లాలంటే ఏడాదిలో 8 నెలల పాటు వాగులు దాటేందుకు తెప్ప ప్రయాణమే చేయాల్సిన పరిస్థితి వారిది. కడెం మండలంలోని గంగాపూర్, ద త్తోజీపేట్, కర్ర తండా, రాణి గూడెం, దేవునిగూడెం, లక్ష్మీపూర్ సహా మరో నాలుగైదు గ్రామాలకు ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఈ గ్రామాలకు వెళ్లేందుకు కేవలం ఏడాదిలో నాలుగు మాసాలు మాత్రమే బస్సు సౌకర్యం ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. స్వాతంత్ర్య వచ్చి ఏళ్లు గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ తమకు మాత్రం ఈ తిప్పలు తప్పడం లేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో కడెం మండలం పాండ్వాపూర్ సమీపం నుంచి నిర్మల్, మంచిర్యాల రహదారి నుంచి దట్టమైన అడవుల మీదుగా గంగాపూర్ పరిసర గ్రామాలకు వెళ్లేలా అప్పటి ఎస్పీ సహకారంతో గ్రామస్థులంతా కలిసి వేసుకున్న మట్టి రోడ్డు మీదుగా బస్సు ఆయా గ్రామాలకు వెళ్తుంది. ఇక వేసవి కాలం ముగిసిందంటే ఆ గ్రామాల ప్రజలకు 8 నెలల పాటు ప్రయాణం ఒక నరక ప్రాయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలను వదిలి బయట ప్రపంచానికి రావాలంటే ఖచ్చితంగా వాగులను దాటాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. దీంతో గంగాపూర్ నుంచి ఖానాపూర్ మండలం ఎర్వ చింతల్ సమీపంలోని కొలంగూడ వరకు నాటు తెప్పలపై ప్రయాణించక తప్పదని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ క్రమంలో గతంలో ప్రమాదాలు సంభవించి పలువురు ప్రాణాలు సైతం కోల్పోయినట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కడెం వాగులో నాటు తెప్పలపై ప్రయాణిస్తున్న గంగాపూర్ పరిసర గ్రామాల ప్రజలు

కలగానే మిగిలిపోతున్న వంతెన నిర్మాణం

ఖానాపూర్ మండలం ఎర్వ చింతల్ మీదుగా కడెం మండలంలోని గంగాపూర్ చుట్టు పక్క గ్రామాలకు వెళ్లేందుకు కడెం వాగుపై వంతెన నిర్మాణం గంగాపూర్ చుట్టుపక్క గ్రామాల ప్రజలకు గలగానే మిగులుతోందని చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ. 9.97 కోట్లతో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించగా నిర్మాణ దశలో ఉన్న పిల్లర్లు వరదల దాటికి కొట్టుకుపోయాయి. ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం తిరిగి మరో వంతెన నిర్మాణం కోసం రూ. 22.15 కోట్లు మంజూరు చేసింది. జనవరిలో ఈ వంతెన నిర్మాణం తాలూకు అగ్రిమెంట్లు పూర్తి చేసుకున్నప్పటికీ పనులను ప్రారంభించేందుకు ఆలస్యమవడంతో ప్రస్తుతం పనులు ఆరంభ దశలోనే ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. 15 పిల్లర్లతో చేపడుతున్న ఈ వంతెన పనుల్లో ప్రస్తుతం ఐదు పిల్లర్లకు మాత్రమే పుట్టింగులను పూర్తి చేశారు. ప్రస్తుతం వర్షాలు ఆరంభమై వాగులు ఉప్పొందుతున్న నేపథ్యంలో వంతెన నిర్మాణ పనులు ముందుకు సాగడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. కేవలం ఐదు పిల్లర్ల పనులనైనా పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా గతంలో ఎన్నికలను సైతం బహిష్కరించి ఈ గ్రామస్థులు తమకు వంతెన నిర్మాణంపై రాజకీయ పార్టీల నాయకులు హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. అప్పట్లో జిల్లా స్థాయి అధికారులు ఆ గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలకు సముదాయించి ఎన్నికల్లో పాల్గొనేలా చేశారు. ప్రభుత్వాలు నిధులను మంజూరు చేస్తున్నాయే తప్పా పనులను వేగంగా పూర్తి చేయడం లేదని గంగాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా గంగాపూర్ వంతెన పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టి తమకు ఈ తెప్ప ప్రయాణం తిప్ప లు తప్పించాలని కోరుతున్నారు.

తెప్పలపై ప్రయాణిస్తే తిప్పలు పడుతున్నాం

- రవి, గంగాపూర్ గ్రామస్థుడు



ఏళ్ల తరబడిగా గంగాపూర్ నుండి బయటకు రావాలన్నా తిరిగి మా గ్రామానికి వెళ్లాలన్నా ఏడాదిలో 8 నెలలు తెప్పలపై ప్రయాణిస్తే తిప్పలు పడుతున్నాం. వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి. నిరంతరం మా ప్రయాణం ప్రమాదపు అంచున బిక్కుబిక్కున సాగించాల్సిన పరిస్థితి ఉంది.

ప్రకృతి సహకరిస్తే మరో 13 నెలల్లో పనులు పూర్తి చేస్తాం

- కమలాకర్, పంచాయతీ రాజ్, డీఈఈ, ఖానాపూర్



గంగాపూర్ వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రకృతి సహకరిస్తే 13 నెలల్లో పనులు పూర్తి చేస్తాం. ప్రస్తుతం ఐదు పిల్లర్లు నిర్మాణ దశలో ఉన్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టగానే పనుల్లో మరింత వేగం పెంచుతాం.

'అత్తా, కోడళ్లకు పింఛన్ ఎప్పుడిస్తారు? : పర్విన్

ఆదిలాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్తాకోడళ్లకు రూ.2500 పింఛన్ ఇస్తామని చెప్పి మోసం చేశారని బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకురాలు పర్విన్‌ఫెరోజ్ మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహిళలకు ఇస్తామన్న పింఛన్‌పై ప్రభుత్వం మాటతప్పిందన్నారు. మహిళల ఓట్ల కోసమే ఎన్నికల ముందు ప్రభుత్వం హామీ ఇచ్చిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ ఇవ్వాలని, లేనిపక్షంలో మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని పర్విన్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

సిరిచెల్మ మల్లికార్జునుడికి భక్తుల మహాభిషేకం




● సిరిచెల్మ మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఇచ్చోడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిచెల్మలో గల చారిత్రక మల్లన్న దేవాలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా రెండవ సోమవారం విశేషమైన పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులు మల్లికార్జునుడికి మహాభిషేకం నిర్వహించారు. అలాగే ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, బిల్వార్చనలు చేశారు. శ్రావణ మాసం కావడంతో చుట్టుపక్క గ్రామాలు, వివిధ మండలాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణామంతా పండగ వాతావరణం నెలకొంది.

అలాగే, ఇచ్చోడలోని శ్మశాన వాటికకు వెళ్లే ముఖద్వారం వద్ద ఉన్న శివుడికి పలువురు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, బిల్వాపత్రాలతో అర్చనలు భక్తిశ్రద్ధతో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో శ్మశాన వాటిన కమిటీ సభ్యులు, తదితరులున్నారు.

ఇసుక బజార్‌లు.. ఇంకెప్పుడు?



● నిర్మాణ దశలో కనిపిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

● పెన్‌గంగా నది సమీపంలో అక్రమంగా నిలువ చేసి ఉంచిన ఇసుక డంపు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు తప్పని ఇసుక కష్టాలు
- అడ్డగోలుగా ధరలు పెంచి అమ్మేసుకుంటున్న వ్యాపారులు
- మంచిర్యాల నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతి
- ఇసుక కొరతతో నత్తనడకన సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు
- ఇల్లు కట్టలేమంటూ లబోదిబోమంటున్న లబ్ధిదారులు

ఆదిలాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇబ్బదులు ఎదురవుతున్నాయి. జిల్లాలో ఇళ్ల నిర్మాణ పనులు ఓ అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా కనిపిస్తుంది. అసలే వర్షాకాలం సీజన్ కావడంతో ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. దీనికి తోడు ఇటుక, సిమెంట్ ధరలు కూడా అమాంతంగా పెరిగిపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే రూ.5లక్షల ఆర్థికసాయం ఏమూలన సరిపోదంటూ వాపోతున్నారు. మొదటి, రెండవ విడతలో జిల్లాకు 9,093 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఇప్పటి వరకు 6,500 ఇళ్లకు మార్కౌట్ చేశారు. 1670 ఇళ్ల నిర్మాణాలు బేస్మిట్ లెవల్‌లో కనిపిస్తున్నాయి. మరో 180 ఇళ్లు రూఫ్‌లెవల్‌కు చేరుకున్నాయి. సుమారుగా 45 ఇళ్ల నిర్మాణాలు స్లాబ్‌లెవల్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇది వరకు రూ.14 కోట్లకు పైగా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించారు. అయితే ఇసుక, ఇటుక, సిమెంట్ ధరలు భారీగా పెరగడం, అలాగే ఖర్చు భారంతో లబ్ధిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఎదురవుతున్న ఇసుక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇసుక బజార్లను ఏర్పాటు చేసి జిల్లాలో ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రకటించిన ఇప్పటి వరకు ఆచరణ సాధ్యం కాకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఇసుక కష్టాలు వెంటాడుతున్నాయి.

ఒక్కో ట్రాక్టర్ రూ.6 వేలు

జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది నుంచి ఇసుకను తరలిస్తూ వ్యాపారులు అడ్డగోలుగా అమ్మేసుకుంటున్నారు. డిమాండ్‌ను బట్టి ధరలను పెంచేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ.6వేల నుంచి రూ.7వేల వరకు విక్రయిస్తున్నారు. గత్యంతరం లేక లబ్ధిదారులు అధిక ధరలకు కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారు. జిల్లాకేంద్రంతో పాటు మారుమూల మండలాలకు ఇసుకను సరఫరా చేస్తూ దండుకుంటున్నారు. ఏజెన్సీ మండలాల్లో ఇసుక ఇబ్బందులు తీవ్రమవుతున్నాయి. కవ్వాల్ అభయారణ్యం పేరిటా అటవీ శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించడంతో ఇసుక కొరత అధికమవుతుంది. ఇదంతా అధికారులకు తెలిసినా.. తెలియనట్లుగానే వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధరలను నియంత్రించక పోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఫైనల్ కాని ఇసుక లోడ్ పాయింట్లు

జిల్లాలో ఎక్కడా అధికారికంగా ఇసుక రీచ్‌లు లేకపోవడంతో ప్రభుత్వం మంచిర్యాల జిల్లా నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇచ్చింది. దీంతో మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్‌ను ఇసుక

(తరువాయి 6వ పేజీలో....)

ఇల్లు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్నాం
: ఊశన్న, లబ్ధిదారుడు, జందాపూర్ గ్రామం



ఇందిరమ్మ ఇల్లు కట్టేందుకు ఇసుక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక అందుబాటులో లేకపోవడంతో రోజుల తరబడి పనులు నిలిచి పోతున్నాయి. ప్రభుత్వం ఇసుకను అందుబాటులోకి తీసుకొస్తే నిర్మాణ పనులు మరింత వేగవంతం చేస్తాం. వర్షాకాలం సీజన్ కావడంతో నదుల నుంచి ఇసుకను తీసుకురావడం ఇబ్బందికరంగా మారింది. దీంతో వ్యాపారులు ధరలను భారీగా పెంచి అమ్మేస్తున్నారు.

ఇసుక లోడ్ పాయింట్లను పరిశీలిస్తున్నాం
: రవీందర్, జిల్లా మైనింగ్ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో ఇసుక బజార్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇసుక లోడ్ పాయింట్లను పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం మంచిర్యాల జిల్లా నుంచి ఇసుకను తీసుకొచ్చుకునేందుకు అనుమతినిచ్చింది. కానీ దూరభారమయ్యే అవకాశం ఉంది. దీంతో నిజామాబాద్ జిల్లా నుంచి కూడా ఇసుకను జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వం అనుమతిస్తే ఇసుకను తరలించి ఇసుక బజార్లలో అందుబాటులో ఉంచుతాం. స్థానికంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి చార్జీలు లేకుండానే ఇసుక రవాణాకు అనుమతులను ఇస్తున్నాం.



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీఓ జనరల్ దామోదర స్వామి

త్వరితగతిన చర్యలు చేపట్టాలి

● ఇన్‌చార్జి ఏపీవో జనరల్ దామోదర స్వామి

ఉట్నూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీఓ జనరల్ దామోదరస్వామి అధికారులకు సూచించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. పింఛన్లు ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ (పీవీటీజీ) మేస్రం మనోహర్, పీహెచ్ఓ సందీప్ కుమార్, ఏఓ వేణు, మేనేజర్ శ్యామల, డీపీఓ ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

● ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి

ఇంద్రవెల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పని చేస్తున్న ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యసేవలు అందిస్తే కఠిన చర్యలు తప్పవని ఏజెన్సీ అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మెత మనోహర్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక హోలీ ట్రినిటి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకున్న అనుమతి పత్రాలతో పాటు వైద్యులు, ఏఎన్ఎంలు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. తనిఖీలో గుర్తించిన వాటిని వారం రోజుల్లో పూర్తి స్థాయిలో నివేదికలు అందించాలని తాకీదు జారీ చేశారు. అనంతరం ముత్నూర్ గ్రామంలోని ఉమేష్ క్లినిక్‌ను తనిఖీ చేసి వైద్యంపై ఆరా తీశారు. హెల్త్ హెచ్ఈవో నాందేవ్, హెల్త్ సూపర్ వైజర్ పవార్ సురేష్, పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే కేసులు : ఎస్సై

భీంపూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీంపూర్ ఎస్సై పీర్‌సింగ్ నాయక్ అన్నారు. ఆయన సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని పిప్పల్‌కోటిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయిసాగు చేసినా, అమ్మిన కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు రాకుండా చూస్తామన్నారు. ఇప్పటికే కొందరికి ప్రభుత్వ పథకాలు రావడం లేదన్నారు.

సమస్యల పట్ల బాధ్యతగా ఉండాలి

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సమస్యలను వీలైనంత వరకు పరిష్కరించాలని, ప్రజలకు జిల్లా పోలీసుల పట్ల ఉన్న నమ్మకాన్ని మరింత పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయగా.... 38 మంది తమ సమస్యలను ఫిర్యాదుల రూపంలో ఎస్పీకి అందించారు. వారి సమస్యలను విన్న ఎస్పీ.. సంబంధిత పోలిసు అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. నేరుగా తనను సంప్రదించలేని వారు జిల్లాలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై, తమకు తెలిసిన సమాచారంపై ఫిర్యాదులపై వాట్సాప్ ద్వారా 8712659973 నెంబర్‌కు చేరవేయాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, సిబ్బంది వామన్ పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ల కోసం దరఖాస్తులు

నార్నూర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేజీబీవీ పాఠశాలలో ఇంగ్లీష్ గెస్ట్ ఉపాధ్యాయ పోస్ట్ కోసం 4 నుంచి 7 తేదీ వరకు కార్యాలయం వద్ద దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుగా ప్రత్యేక అధికారి హిమబిందు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, బీ ఎడ్, టెట్ క్వాలిఫై ఉండాలని, మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

రిమ్స్‌లో క్షతగాత్రులకు పరామర్శ

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బోథ్ మండలంలోని పిప్పల్ ధరి గ్రామానికి చెందిన తొడసం సోనేరావు ఇంట్లో సిలెండర్ పేలి ఆరుగురికి తీవ్ర గాయాలైన నేపథ్యంలో బాధితులు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ సోయం బాపూరావు బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలపై ఆరా తీశారు. ఆయన వెంట రాజ్ గోండ్ సేవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సెడ్మాకి ఆనంద్ రావు, రాజు యాదవ్ ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న సోయం బాపూరావు

తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు

● వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాలు, పోషకాహార దినోత్సవం సందర్భంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో పాటు సంబంధిత అధికరులతో కలిసి ఆవిష్కరించారు. ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లి పాల వారోత్సవాలను జరుపుకుంటారని, తల్లి పాల ప్రాముఖ్యత, పిల్లల పెరుగుదలకు తల్లి పాలు ఎంత ముఖ్యమో అవగాహన కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిఅపారు. ఈనెలలో చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని, గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు.

● అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్ టౌన్: ప్రజావాణిలో అందించే ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి విభాగంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అందించిన ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. అనంతరం వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో 112 అర్జీలను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.

● 'వెనకబడిన జిల్లా అనే మాటను రూపుమాపుదాం'

ఆదిలాబాద్ టౌన్: నీతి అయోగ్ నార్నూర్ బ్లాక్ రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్‌లో ఇటీవల స్వర్ణ పతకం అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను అధికారులు ఘనంగా సత్కరించారు. హైదరబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఇటీవల జరిగిన నీతి అయోగ్ రాష్ట్రస్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్‌లో నార్నూర్ బ్లాక్ ను ముందుంజలో ఉంచిన నేపథ్యంలో కలెక్టర్ అవార్డు స్వీకరించారు. ఈ మేరకు పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు ఆయనను శాలువాలతో సన్మానించారు. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా అనే మాటను రూపుమాపేలా చేయాలని, ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవితోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అలాగే, నీతి అయోగ్ నార్నూర్ బ్లాక్ రాష్ట్ర స్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్‌లో భాగంగా ఇటీవల స్వర్ణ పతకాన్ని అందుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ తదితరులు సత్కరించారు. కలెక్టర్‌ను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

దివ్యాంగులకు పెంచిన పింఛన్‌లను అందించాలి

● ఆదిలాబాద్ సభలో మందకృష్ణ మాదిగ ధ్వజం

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం పెంచిన పెన్షన్‌లను అందించాలని, అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా ప్రభుత్వం ఈ విషయంపై స్పందించకపోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సమస్యల సాధనే లక్ష్యంగా హైదరాబాద్‌లో ఈనెల 13న నిర్వహించ తలపెట్టిన ఆసర, చేయూత పెన్షన్ దారుల సన్నాహక మహా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహా గర్జన సభ సన్నాహక సదస్సును సోమవారం పట్టణంలోని రెవెన్యూ గార్డెన్స్ లో నిర్వహించగా.. ఆయన కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు మంద కృష్ణ మాదిగకు సాదర స్వాగతం పాలికారు. అనంతరం సన్నాహక సదస్సు ముఖ్య ఉద్దేశాన్ని వివరిస్తూ పెన్షన్ దారులు ఎదుర్కుంటున్న సమస్యలను వివరించారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే పెన్షన్‌లను అందించాలని ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపక్ష నేతగా ఈ అంశంపై గళమెత్తకుండా మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి దివ్యాంగులకు ఇచ్చిన హామీలపై మోసం చేస్తున్నప్పటికీ ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రాడు.. ప్రజా సమస్యలపై మాట్లాడడంటూ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి ప్రేమ్ రాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అరెల్లి మల్లేష్, నాందేవ్, విలాస్, నివర్తి, అంజద్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న అభిమానులు, పార్టీ కార్యకర్తలు

ఘనంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదినం

● మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ఆదిలాబాద్ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలను సోమవారం అట్టహాసంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి వెళ్లడంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం నేతృత్వంలో వేడుకలు సాగాయి. ఎమ్మెల్యే పుట్టిన రోజును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్దఎత్తున యువకులు, పార్టీ నేతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మెగా శిబిరంలో 542 మందికి పైగా రక్తదానం చేశారు. ఇందులో విజయ్ భోయర్, లాలామున్న, ఎన్నాల నగేష్, ధోని జ్యోతి, మయూర్ చంద్ర, పద్మవార్ రాకేశ్, కేమ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ సాత్నాల, జైనథ్ మండల కేంద్రాలలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ జన్మదిన వేడుకలను సోమవారం బీజేపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బర్త్‌డే కేక్ కట్ చేసి ఒకరినొకరు మిఠాయిలను పంచుకొని టపాకాయలను కాల్చారు. దీంతో పాటు బీజేపీ నాయకులు కార్యకర్తలు రక్తదానం చేశారు. ఇందులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్టిఅశోక్‌రెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి బోయర్ విజయ్, హస్తక్ సుభాష్, సాత్నాల జడ్పీటీసీ ఇన్‌చార్జి పోతరాజు రమేష్, మండల ఉపాధ్యక్షుడు ప్రతాప్‌యాదవ్, తదితరులున్నారు.



సాత్నాలలో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు